క్లుప్తంగా

రేపు ములుకుదురులో బజరంగ్ నేత్రజ్యోతి శిబిరం

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



నగరంపాలెం: పొన్నూరు మండలంలోని ములుకుదురు, మాచవరం గ్రామాల పరిధిలోని వారికి ములుకుదురు మెయిన్ రోడ్డులోని వాటర్ ప్లాంటు వద్ద ఆదివారం బజరంగ్ నేత్రజ్యోతిని నిర్వహిస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న సంక్షేమ పాలనను ఆదర్శంగా తీసుకుని కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. నేత్ర సమస్యల నుంచి గ్రామస్తులందరికీ రక్షణ కల్పించడమే ఏకైక లక్ష్యమని ఆయన తెలియజేశారు. రైతులు, కూలీలు, వెనుకబడిన వర్గాలు, దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలు అధికంగా ఉన్న గ్రామాలకు అధిక ప్రాధాన్యతనిచ్చి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జగనన్న సంక్షేమ పాలనను ఆదర్శంగా తీసుకుని కుల, మత, రాజకీయాలకు అతీతంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కంటి సమస్య ఉన్నట్లు గుర్తించిన వారికి ఏడు రోజుల్లో కళ్లజోళ్లు అందిస్తున్నట్లు చెప్పారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా ఇప్పటి వరకు 12,990 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి, 11,093 మందికి కళ్లజోళ్లను అందించినట్లు వివరించారు.

'డ్రాట్ ప్రూఫింగ్ మోడల్' సాగుపై శిక్షణ



గుంటూరు రూరల్: కరువు ప్రభావాన్ని తట్టుకొనే విధంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో డ్రాట్ ప్రూఫింగ్ మోడల్‌పై రైతులకు, సిబ్బందికి శిక్షణను శుక్రవారం నిర్వహించారు. మండలంలోని వెంగళాయపాలెంలో ప్రకృతి వ్యవసాయ రైతు శృతి పంట భూమిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు అడుగులకు ఒక అడుగు పాదుగా చేసుకొని మధ్యలో రెండు అంగుళాల లోతులో కంది లేదా ఆముదం, దాన్నుంచి తూర్పుకు గోరుచిక్కుడు, పడమరకు అలసంద, ఉత్తరానికి చెట్టు చిక్కుడు, దక్షిణానికి సజ్జ వేసుకోవడం వల్ల పంట వర్షాభావ పరిస్థితుల్ని తట్టుకుంటుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె. రాజకుమారి వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో క్షేత్రస్థాయిలో మార్కింగ్, పాదులు, విత్తన శుద్ధి, విత్తనాలు నాటించడాన్ని ప్రాక్టికల్‌గా చేయించారు. వర్షాభావ పరిస్థితుల్ని తట్టుకోవడం కోసం విత్తనాన్ని మట్టి, ఘనజీవామృతం, బూడిదలతో గుళికల రూపంలో చేసుకుని నాటుకోవటం వల్ల అనుకూల వాతావరణంలో మొలకెత్తుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏవోలు శ్రీనివాసరావు, రమణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

క్వారీ గుంతలో పడి యువకుడి మృతి



చేబ్రోలు: పశువుల్ని కడగడానికి క్వారీ గుంతలోకి దిగిన యువకుడు ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన సంఘటన చేబ్రోలు మండలం సుద్దపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తోట మహేష్ (25) పశువుల మేతకు గురువారం మధ్యాహ్నం వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. స్థానికులు, బంధువులు గాలించగా సుద్దపల్లి గ్రామ శివారులోని క్వారీ గుంత ఒడ్డున సెల్ ఫోను, కర్ర, చెప్పులు కనిపించాయి. గుంతలో గాలించగా మహేష్ శవం లభించింది. గేదెలు కడిగే సమయంలో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందినట్లుగా గ్రామస్తులు భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని తహసీల్దార్ కె.వి. గోపాలకృష్ణ, ఎస్‌ఐ ఆనంద్ పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

మేయర్ కావటి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించాలని మునిసిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్ ట్రేడ్ యూనియన్ నాయకులు మేయర్‌ను సంపత్‌నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిసి కోరారు. స్పందించిన మేయర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంక్రాంతి, రంజాన్ వేడుకల్ని నిర్వహిస్తున్నామని, అదే తరహాలో ఈ సంవత్సరం కూడా క్రిస్మస్ వేడుకల్ని నిర్వహిస్తామని తెలిపారు. తేదీని ఖరారు చేయాలని ఆయన సూచించారు. కార్పొరేటర్ బూసి రాజాలత, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట

ప్రత్తిపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఎంపీపీ దాసరి అన్నమ్మ తెలిపారు. మండలంలోని నడింపాలెంలో శుక్రవారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రత్నకుమార్ అధ్యక్షత వహించారు. తొలుత సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలోని వివిధ వర్గాల ప్రజలకు కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా రూ. 17,58,45,881 లబ్ధి చేకూరిందని తెలిపారు. దేశ చరిత్రలోనే ఇంత పెద్ద మొత్తంలో సంక్షేమాన్ని గడపగడపకూ చేరుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ప్రజలంతా ఆశీర్వదించాలని పార్టీ మండల కన్వీనర్ కట్టా సుబ్బారావు కోరారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో గడపగడపకూ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనుల్ని నేతలు వివరించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాల్ని ప్రజలకు అందజేశారు. సచివాలయాల మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఉడుతూరి ఓంప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రైతుల పాలిట పెన్నిధి సీఎం వై.ఎస్. జగన్ అన్నారు. రైతు భరోసా, రైతు బీమా, భూముల రీసర్వే, అసైన్‌మెంట్ భూములపై సంపూర్ణ హక్కులు.. ఇలా ఎన్నో వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ సురేష్‌కుమార్, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ నాగిరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ ఆళ్ల వీరాస్వామి, సొసైటీ మాజీ అధ్యక్షుడు గింజుపల్లి సుబ్బారావు, పార్టీ నాయకులు షేక్ దరియావలి, ఉప సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, గురుగూరి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి ఖాజా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



నడింపాలెంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు

సంక్షేమ సారథి జగన్

కొండపాటూరు(కాకుమాను): రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సకాలంలో పథకాల్ని సక్రమంగా అందించి సంక్షేమ సారథిగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి నిలిచారని ఎంపీటీసీ సభ్యురాలు నెప్పల సౌజన్య పేర్కొన్నారు. మండలంలోని కొండపాటూరులో శుక్రవారం రాత్రి ఏపీకి జగనే సీఎంగా ఎందుకు కావాలంటే? కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి నేటి వరకు అర్హతే ఆధారంగా కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలు చూడకుండా అనుకున్న సమయానికి సకాలంలో, సక్రమంగా సంక్షేమ పథకాల్ని అందిస్తున్నారని తెలిపారు.ఈ సందర్భంగా గ్రామంలో వై.ఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాలతో పాటు గ్రామస్తులు వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందిన పట్టికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా కమిటీ జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, కంఠమనేని రాంబాబు, నెప్పల బ్రహ్మాజీ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ గేరా పున్నారావు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మెరిగల రవిబాబు, పెద్ది మురళి, జేసీఎస్ మండల కన్వీనర్ పంగులూరి శ్రీనివాసరావు, జీవా, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు

పెదకాకాని: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు తెలిపారు. పెదకాకాని సచివాలయం- 3లో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ (రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే..) కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్లజ్యోతి మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు నేరుగా బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. ఆయన పరిపాలనలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారన్నారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన తీసుకువచ్చారని పేర్కొన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎంత లబ్ధి చేకూరిందో ఇంటింటికీ వెళ్లి వివరిస్తూ, బుక్‌లెట్ అందజేయాల్సిన బాధ్యత వలంటీర్లు, స్థానిక నాయకులపై ఉందని చెప్పారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం. రాజారామ్, మండల కన్వీనర్ చాగంటి మురళీమోహన్‌రెడ్డి, గోళ్ల జోసఫ్, ఆలా శ్రీనివాసరావు, రవీంద్ర, మురికిపూడి ఆదిలక్ష్మి, సుంకర కృష్ణారెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే పొన్నూరు అభివృద్ధి



పొన్నూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన నాయకులు

పొన్నూరు: నియోజకవర్గ అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే జరిగిందని మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే ? కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 21 వార్డు గాజులపాలెం సచివాలయంలో సంక్షేమ పథకాలు, వార్డులో జరిగిన అభివృద్ధి వివరాలతో ప్రదర్శించిన బోర్డును వైఎస్సార్ సీపీ నాయకులు ఆవిష్కరించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎంఏ. మహమ్మద్ మాట్లాడుతూ గత పాతికేళ్ల టీడీపీ పాలనలో పట్టణంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. రాజకీయాల ప్రమేయం లేకుండా ప్రతి ఒక్కరికీ అర్హతయే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బొద్దులూరి రంగారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

గుంటూరు రూరల్: రాష్ట్ర ప్రజలు సంతోషంగా సంక్షేమ పథకాలతో ఆనందంగా ఉండాలన్నా, అభివృద్ధిలో రాష్ట్రం ముందుకు సాగాలన్నా ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. 40వ డివిజన్ పెదపలకలూరులో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే ? అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అర్బన్ క్లస్టర్ – 2 కన్వీనర్ బండారు శ్రీనివాసరావు పాల్గొని, సచివాలయం పరిధిలో ప్రభుత్వం రూ. 22 కోట్లతో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల పట్టికతో పాటు వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల్ని వివరించి, వారి అభిప్రాయాల్ని సేకరించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పిల్లి నాగేశ్వరరావు, ఆర్ అండ్ బీ డైరెక్టర్ పిల్లి మేరీ, చెరుకూరి సాంబశివరావు, ముత్యాల నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



పెదపలకలూరులో ప్రజాభిప్రాయ సేకరణ



పొత్తూరులో ప్రజాభిప్రాయ సేకరణ

పొత్తూరులో...

జగనన్న ద్వారానే ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకట రమణాదేవి, అర్బన్ క్లస్టర్- 1 కన్వీనర్ ఏటుకూరి విజయసారథి తెలిపారు. పొత్తూరులో శుక్రవారం నిర్వహించిన జగనే ఆంధ్రప్రదేశ్‌కి ఎందుకు కావాలంటే? అనే కార్యక్రమంలో సచివాలయం పరిధిలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల పట్టికను ప్రారంభించారు. జెండా ఆవిష్కరణ చేసి, ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. కార్యక్రమంలో శ్యామల బ్రహ్మరెడ్డి, కాశీవిశ్వనాథం, మందాడి నారాయణమ్మ, శోభన్‌బాబు, తాడిశెట్టి కోటయ్య, గడల రాంబాబు, చిమటా అర్జున్, ఆలా సరస్వతి, కగ్గా కోటేశ్వరరావు, పెద్దిరెడ్డి సామ్రాజ్యం, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'చలో తిరుమల' పాదయాత్రకు సంఘీభావం



సంఘీభావం తెలుపుతున్న దయాసాగర్, నేతలు

గుంటూరు రూరల్: రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రజలు సంక్షేమ పథకాలతో సంతోషంగా జీవించాలన్నా మరలా ముఖ్యమంత్రిగా జగనన్నే రావాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు విజయనగరం నుంచి తిరుపతికి చేపట్టిన పాదయాత్రకు ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలు, నేతలు బ్రహ్మరథం పట్టి సంఘీభావం తెలిపారు. పాదయాత్ర శుక్రవారం ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రవేశించింది. మచిలీపట్నం పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ చౌడవరం స్టేట్ బ్యాంకు వద్ద రఘురాజుకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, ఎంపీపీ ఇంటూరి పద్మావతి , కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి, అర్బన్ క్లస్టర్ – 2 కన్వీనర్ బండారు శ్రీనివాసరావు, పెదనందిపాడు మండల అధ్యక్షుడు షేక్ ఖాశింపీరా, ఆర్ అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరీ, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెరుకూరు సాంబశివరావు, మిర్చి యార్డ్ డైరెక్టర్ బందలపాటి వెంకటేశ్వరరావు, సర్పంచులు ఆరుదల సాంబశివరావు, ఎదురుపాక వెంకట్, మాధవరావు, రత్నరాజు, దాసరి పద్మారావు, సురేష్, జగన్ మోహన్‌రెడ్డి, శ్యామల బ్రహ్మరెడ్డి, కాశీ, కట్టా సుబ్బారావు, మన్నెం లక్ష్మి, ముత్యాలరాజు, పుట్టా బాజీ, సాయి, కోటేశ్వరరావు, సామ్రాజ్యం, నాగేశ్వరరావు, బాలాస్వామి, శ్రీనివాసరెడ్డి, వెంకట్రావు, సుబ్బారావు, చిట్టిబాబు, అమృతయ్య, లక్ష్మణ్, గుజ్జుల శివారెడ్డి పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



చేబ్రోలు: మండలంలోని కొత్తరెడ్డిపాలెం దళితవాడలో శుక్రవారం పూరిల్లు దగ్ధమైంది. ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి డి. సునీల్‌కు చెందిన పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లోని సామగ్రి, దుస్తులతో పాటు అప్పు తీర్చడం కోసం తీసుకొచ్చిన రూ. 40 వేల నగదు కాలిపోయాయి. సుమారు రెండు లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. సంఘటన స్థలాన్ని తహసీల్దారు కె.వి. గోపాలకృష్ణ పరిశీలించారు.

ఆర్‌వీఆర్‌జేసీలో హ్యాక్‌థాన్ పోటీలు ప్రారంభం

గుంటూరు రూరల్: వివిధ ప్రాంతాల విద్యార్థుల ప్రతిభా నైపుణ్యాల్ని పరిశ్రమలకు పరిచయం చేసేందుకు తమ కళాశాల వేదిక కావడం గర్వకారణమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో శుక్రవారం వివిధ రకాల కంపెనీలలో యాప్ అండ్ వెబ్ డెవలప్‌మెంటు, మెషిన్ డిజైనింగ్, ఇంటర్‌నెట్ అఫ్ థింగ్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కెమికల్ అండ్ పాలిమర్, టెక్స్‌టైల్, అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ విభాగాల్లో ఎదురయ్యే వివిధ రకాల సమస్యలకు పరిష్కార మార్గాల్ని చూపడానికి దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ విద్యార్థులకు కళాశాలలో 24 గంటల హ్యాక్‌థాన్ పోటీల్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలోని వివిధ కళాశాలల నుంచి మొత్తం 550 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా పేర్లను నమోదు చేసుకున్నారు. ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికైన 160 మంది విద్యార్థులు హ్యాక్‌థాన్ పోటీలో పాల్గొన్నారు. తమ ముందున్న సమస్యలకు పరిష్కారాల్ని చూపడం ప్రారంభించారు. నిరంతర వినూత్న ఆలోచనలే, అద్భుతాల్ని సృష్టింపజేస్తాయని, తమకు ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి విద్యార్థులు సిద్ధంగా ఉండాలని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, కళాశాల ఐఐసీ కన్వీనర్ నాగమల్లేశ్వరరావు, సీఎస్‌బీఎస్ డేటా సైన్స్ విభాగాధిపతి ఎం.వి.పి. చంద్రశేఖర్, ఈసీఈ విభాగాధిపతి రంగబాబు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గురుకులంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

కాకుమాను: గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం తెలిపారు. స్థానిక అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో జిల్లా పరిషత్ నిధులు రూ.2లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంటును శుక్రవారం ఆమె ఎంపీపీ రామినేని శ్రీనివాసరావుతో కలసి ప్రారంభించారు.ఈ సందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడుతూ విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారనే విషయం తన దృష్టికి రావడంతో జిల్లా పరిషత్ నుంచి రూ.13.5 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. వాటిలో రూ.2లక్షలతో ఆర్వో వాటర్ ప్లాంటును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మిగిలిన నిధులతో పాఠశాలలో మౌలిక సదుపాయాల్ని కల్పించనున్నట్లు ఆమె తెలిపారు.ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందని చెప్పారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మారిన మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజనాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ముజావర్ షేక్ అసదుల్లా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్, టీచర్స్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్వో వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు షేక్ గుల్జార్ బేగం

ఫిబ్రవరి 2,3 తేదీల్లో ఏఎన్‌యూలో జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ జువాలజీ అండ్ ఆక్వా కల్చర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను శుక్రవారం వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు డైరెక్టర్ ఆచార్య కె. సునీత మాట్లాడుతూ 'బయోడైవర్సిటీ ఆక్వా కల్చర్ అండ్ ఆక్వాటిక్ టాక్సికాలజీ' అనే అంశంపై వచ్చే ఏడాది ఫిబ్రవరి 2, 3 తేదీల్లో యూజీసీ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా పరిశోధన సంస్థలు, యూనివర్సిటీల నుంచి ప్రతినిధులు పాల్గొననున్నారని చెప్పారు. సదస్సుకు పత్రాలు పంపే వారు జనవరి 10వ తేదీలోగా డైరెక్టర్‌కు పంపాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. సిద్ధయ్య, జువాలజీ అధ్యాపకురాలు ఆచార్య పద్మావతి పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ

చురుగ్గా పింఛన్ల పంపిణీ



వృద్ధురాలికి పింఛన్ నగదు అందిస్తున్న దివ్యాంగ వలంటీర్

పొన్నూరు: పట్టణ, మండలంలో వేకువజాము నుంచే వలంటీర్లు సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి బయోమెట్రిక్ నమోదు చేసి, డబ్బులు అందజేశారు. ఉదయాన్నే పింఛన్ అందడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. పొన్నూరులో దాదాపు 85 శాతం పింఛన్ పంపిణీ పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

ఎయిడ్స్ మహమ్మారి నిర్మూలనే ధ్యేయం



ఆర్‌వీఆర్‌జేసీలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



గొట్టిపాడులో అవగాహన ర్యాలీ

గుంటూరు రూరల్: ఎయిడ్స్ మహమ్మారిని పూర్తి స్థాయిలో నిర్మూలించడానికి గానూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విద్యార్థులు ముందుకు రావాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ తెలిపారు. వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా శుక్రవారం చౌడవరంలోని కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులతో ఎయిడ్స్ నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. వ్యక్తి జీవితానికి సంపూర్ణ ఆరోగ్యమే గొప్ప వరమని, దానిని రక్షించుకొనేందుకు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎన్.వి. శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ విభాగం కోఆర్డినేటర్ ఎం.సుధాకర్, జి. రామ్మోహనరావు, వి.రామకోటేశ్వరరావు, ఎస్. రాధిక పాల్గొన్నారు.

ఎయిడ్స్ అంటువ్యాధి కాదు.. అంటించుకునే వ్యాధి

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరియునిస్ అన్నారు. వరల్డ్ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని పెదగొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ హ్యూమన్ ఇమ్యునో వైరస్ ద్వారా సోకే ఈ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలుషిత రక్తమార్పిడితో పాటు హెచ్ఐవి సోకిన వారికి వాడిన ఇంజక్షన్లను వేరొకరికి వాడటం వల్ల కూడా సంక్రమిస్తుందని తెలిపారు. సురక్షితం కాని సంభోగం అనర్థాలకు దారితీస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో కె. చెల్లమ్మ, పీహెచ్ఎన్ డి. నిర్మలాదేవి, ఎంపీహెచ్ఎస్ ఎన్. విజయకుమారి, ఏఎన్ఎం కళావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి



పట్నంబజారు: అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన గుంటూరు నగరంలో చోటుచేసుకుంది. లాలాపేట పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసరావుపేట 60 అడుగుల రోడ్డులో నివాసం ఉండే షేక్ బాజీ (39) మిర్చి యార్డులో తొడాలు తీసే పనికి వెళుతూ ఉంటుంది. ఆరు నెలలుగా సంపత్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ సైదా (అల్లల్ల)తో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్యా వివాహేతర సంబంధం ఏర్పడింది. శుక్రవారం ఎప్పటిలాగే పనికి వెళుతున్నానని చెప్పి వెళ్లిన షేక్ బాజీ సాయంత్రం ఇంటికి రాకపోవడంతో భర్త హుస్సేన్ పనిచేసే దుకాణానికి ఫోన్ చేశాడు. అప్పటికే వెళ్లిపోయిందని చెప్పారు. భర్త హుస్సేన్ సంపత్‌నగర్‌లోని సైదా నివాసానికి వెళ్లాడు. తలుపులు తీసి చూసేసరికి బాజీ మృతి చెంది పడి ఉంది. సంఘటనా స్థలంలో చేతి గాజులు పగిలి ఉండటం, సైదాకు ఫోన్ చేసినప్పటికీ స్పందించక పోవడంతో హత్య చేసి ఉంటాడనే అనుమానం పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. నిందితుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుంటూరు రూరల్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని నల్లపాడు పోలీసులు బుడంపాడు పొలాల్లో శుక్రవారం గుర్తించారు. నల్లపాడు స్టేషన్ ఎస్ఐ రోశయ్య తెలిపిన వివరాల ప్రకారం... గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పొలాల్లో ఉందని స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించామన్నారు. మృతుడు వయస్సు 55 సంవత్సరాలు ఉంటుందని, శరీరంపై బ్లూ చారల చొక్కా, జీన్స్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు నల్లపాడు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

నేడు అయ్యప్ప పడి పూజ

పాత గుంటూరు: అరండల్‌పేట ఏడో లైనులోని రామచంద్ర బ్రదర్స్ మెగా ఫర్నీచర్ షోరూం ఆవరణలో శనివారం అయ్యప్పస్వామి పడి పూజ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు సంస్థ అధినేత పుష్పాళ్ల సుబ్బారావు ప్రకటనలో తెలిపారు. రాత్రి 7 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో శ్రీనివాసన్ నాయర్ నిర్వహణలో అభిషేకాలు జరుగుతాయని పేర్కొన్నారు